క్లుప్తంగా

నీరు విడుదల చేయాలి

పాలకొండ: వేసవిలో పశువుల దాహార్తి తీర్చేలా తోటపల్లి ఎడమ కాలువ ద్వారా నీరు విడుదల చేయాలని రైతు సంఘ నాయకుడు కిమి రామ్మూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రతిఏటా వేసవిలో నీరు విడుదల చేయడం ద్వారా చెరువులు నిండేవని.. ఈ ఏడాది ఇంతవరకు నీటి విడుదలపై జల వనరుల శాఖ అధికారులు ఇంతవరకు ఎటువంటి ప్రకటన చేయలేదని పేర్కొన్నారు. ఇప్పటికే పలుమార్లు అధికారులకు నీటి విడుదల కోసం విన్నవించామన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం: స్థానిక కేజీబీవీ(కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం)లో ఆరో తరగతి, ఇంటర్మీడియట్(హెచ్ఈసీ గ్రూపు)ల్లో ప్రవేశాలకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీరంజని ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, ఆరో తరగతిలో 40 సీట్లు, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులంతా ఈ నెల 22వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో apkfbv.a pfrr.in దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏడు, తొమ్మిదో తరగతుల్లోని ఖాళీ సీట్లను కూడా భర్తీ చేయనున్నామన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 9701506909, 8919635046ను సంప్రదించాలని కోరారు.

జోరందుకున్న కర్బూజా అమ్మకాలు

గరుగుబిల్లి: వేసవి నేపథ్యంలో ప్రజల దాహార్తి తీర్చడంలో కర్బూజా పండు ప్రధాన పాత్ర పోషిస్తోంది. దీంతో కర్బూజా అమ్మకాలు జోరందుకున్నాయి. మండలంలోని ఖడ్గవలస, రావివలస, ఎర్రన్నగుడి జంక్షన్‌ల వద్ద కర్బూజా పండ్ల అమ్మకాలు ఊపందుకున్నాయి. కిలో రూ.25 పలికే ఈ పండ్లను అందరూ కొనుగోలు చేస్తున్నారు. నీటి శాతం అధికంగా ఉండే ఈ పండును తింటే వేసవి ఎండల నుంచి ఉపశమనం లభిస్తోందని తిన్న వారంతా చెబుతున్నారు.

తోటపల్లి కాలువలను ఆధునీకరించండి



మాట్లాడుతున్న విక్రాంత్, కళావతి

పాలకొండ: తోటపల్లి కాలువలను ఆధునీకరించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి డిమాండ్ చేశారు. డివిజన్ కేంద్రమైన పాలకొండలో శుక్రవారం వారు మాట్లాడుతూ.. తోటపల్లి ఆధునీకరణ పనులు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ప్రారంభం కాగా.. అనంతరం అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో పనులు నెమ్మదించాయని చెప్పారు. అనంతరం 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనులపై దృష్టి సారించడంతో 23 శాతం వరకు పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఇందుకు సంబంధించి కోట్లాది రూపాయల బిల్లులు కూడామ చెల్లించినట్టు చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం తోటపల్లి పనులను పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. బితాల నుంచి తొలగించిందని ఆరోపించారు. ఆధునీకరణ పనులు ప్రాధానత్య లిస్టులోనికి తీసుకువచ్చి నిధులు మంజూరు చేయాలని కోరారు.

మందుల దుకాణాల్లో తనిఖీలు



మందుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

పాలకొండ: పట్టణంలోని పలు మందుల దుకాణాల్లో పార్వతీపురం మన్యం జిల్లా ప్రత్యేకాధికారి వి. రమేష్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఆశాషైనీ శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. కాలం చెల్లిన మందులు, మత్తు కలిగించే మందులు, బిల్లులు, స్టాక్ తదితర వివరాలపై ఆరా తీశారు.

ఎంఈవోకు గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎంఈవో

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని గిరిజన గ్రామాలైన కూటాం, గొర్లి ప్రభుత్వ పాఠశాలల సందర్శనకు వెళ్లి, తిరిగి వస్తుండగా ఎంఈవో శ్రీనివాసరావు గాయపడ్డారు. కొండపై ఉన్న ఆయా గ్రామాల పాఠశాలలకు శుక్రవారం వెళ్లిన ఆయన.. అక్కడి నుంచి కొండ కిందికి వచ్చేందుకు ఓ యువకుడిని బైక్‌పై దింపమని కోరారు. ఆ యువకుడు బైక్‌పై ఎంఈవోను ఎక్కించుకుని వస్తుండగా, అదుపు తప్పి బైక్ కిందపడింది. దీంతో ఎంఈవో కూడా కిందపడి తీవ్రగాయాలపాలయ్యారు. ఆయన ఎడమ చేయి కూడా విరిగిపోయింది. ప్రస్తుతం ఆయనను చికిత్స నిమిత్తం రామభద్రపురం పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం మన్యం జిల్లా ఆస్పత్రికి 108 అంబులెన్స్‌లో తరలించారు. ఆయన వెంట ఉన్న సీఆర్‌పీ సోమేష్‌కు కూడా స్వల్పగాయాలైనట్లు సమాచారం.

● సస్యరక్షణతో అధిక దిగుబడులు..



జీడి మామిడి సాగుకు సంబంధించి కాయదశలో చేపట్టే సస్యరక్షణతో అధిక దిగుబడులు సాధించవచ్చని పాలకొండ ఉద్యానవనశాఖ అధికారి టి.అమరేశ్వరి సూచించారు. మండలంలోని బిటివాడ గ్రామంలో జీడిమామిడిలో సస్యరక్షణ చర్యలపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఆమెతో పాటు ప్రకృతి వ్యవసాయ అధికారులు ఎంటీ సింహాచలం, సీసీ ఆనందరావు పాల్గొన్నారు. – వీరఘట్టం

● ఎడారిలా..



వీరఘట్టం మండలం గుండా ప్రవహించే నాగావళి నది పూర్తిగా ఎండిపోయి ఎడారిని తలపిస్తోంది. కిమ్మి నాగావళి నదీ తీరంలో నాచుపట్టిన కొద్ది నీరు మాత్రమే దిగువ ప్రాంతానికి ప్రవహిస్తుండగా.. మిగిలిన ప్రాంతమంతా ఇసుక దిబ్బలతో మైదాన ప్రాంతంలా మారింది. మార్చి నెలలో ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఎలా ఉండబోతుందోనని సమీప గ్రామాల ప్రజలు, రైతులు ఆందోళన చెందుతున్నారు. – వీరఘట్టం

● జాబ్‌మేళాకు 54 మంది హాజరు ..



స్థానిక వైటీసీలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు 54 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. వీరికి ఆయా కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి 35 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు స్కిల్ కళాశాల సమన్వయకర్త వెంకటరమణ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారు ఈనెల 24న జాయిన్ కావాల్సి ఉంటుందన్నారు. – సీతంపేట

చలువద్దం.. కళ్లకు నేస్తం!

- కళ్లద్దాలతో కళ్లకు రక్షణ
- వేసవితాపం నుంచి ఉపశమనం కూడా..
- ఎండల బారినపడకుండా కొనుగోలుకు ఆసక్తి



ఉల్లిబద్ర జంక్షన్‌లో చలువ కళ్లద్దాలు, టోపీల విక్రయాలు

గరుగుబిల్లి: వేసవి ఎండలు రోజురోజుకూ మండుతున్నాయి. మండే ఎండలోకి వెళ్తే చాలు కళ్లు మండడం, ఎర్రబడడం వంటివి జరుగుతాయి. వేసవికాలంలో అయితే ఈ సమస్యలు మరింత తీవ్రంగా ఉంటాయి. వాటి నుంచి రక్షణ పొందాలంటే చలువ కళ్లద్దాలు తప్పనిసరిగా వినియోగించాలని నేత్ర వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఈ ఏడాది మార్చి రెండో వారం నుంచి గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గత కొన్నిరోజులుగా 38 నుంచి 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదై, నిప్పుల కొలిమిని తలపిస్తున్నాయి. ఇలాంటి సమయాల్లో బయట ప్రయాణాలు చేయడం ప్రమాదకరం. అందులోనూ కళ్లకు ఎటువంటి రక్షణ లేకుండా బయటకు వెళ్తే అంతే సంగతులు. చిన్నా, పెద్దా తేడా లేకుండా అందరూ ఎండల్లో తిరగాల్సి వచ్చినప్పుడు చలువ కళ్లద్దాలు వినియోగిస్తే అతినీలలోహిత కిరణాలు నేరుగా కళ్లమీద పడకుండా ఉంటాయి. ప్రస్తుతం వేసవితాపం నుంచి ఉపశమనం పొందేందుకు, అలాగే కళ్లకు రక్షణగా కూడా ఉపయోగపడుతుందన్న ఉద్దేశంతో అందరూ చలువ కళ్లద్దాలు కొనుగోళ్లకు ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రస్తుతం గరుగుబిల్లి మండలంలోని ఖడ్గవలస, ఉల్లిబద్ర జంక్షన్లలో కళ్లద్దాలు, టోపీల విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి.

వాడకుంటే ఇవీ సమస్యలు..

- ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు కళ్లకు రక్షణగా చలువద్దాలు వాడకుండా ప్రయాణాలు చేయవద్దు
- కళ్లద్దాలు వాడకుండా ఎండలో తిరిగితే కళ్లు మండిపోవడం, ఎర్రబడిపోవడం, తడి ఆరిపోయి కంటి సమస్యలు మొదలవుతాయి
- వేసవిలో కళ్లకు ఇన్‌ఫెక్షన్ వేగంగా సోకుతుంది. కళ్లకలకలు వంటి సమస్య వస్తుంది.
- ఎండ నేరుగా కంటికి తాకడం వల్ల కార్నియా దెబ్బతిని కంటి చూపు పోతుంది

ఇలా చేస్తే మేలు..

- ఎండల తీవ్రత దృష్ట్యా చలువ అద్దాలు తప్పనిసరిగా వినియోగించాలి
- కళ్లద్దాలతో పాటు నెత్తిపై టోపీ ధరించాలి
- ఫొటో గ్రే, పోలరైజ్డ్ వంటి నాణ్యమైన అద్దాలు వినియోగిస్తే మంచిది
- వాహనదారులు అద్దాలతో పాటు హెల్మెట్ ధరిస్తే తలనొప్పి వంటి సమస్య రాదు.

గృహ నిర్మాణ సామగ్రి అందజేస్తాం



మాట్లాడుతున్న హోలీక్రాస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ కరణం ప్రభుదాస్

భామిని: గిరిజన ప్రాంతాల్లో అర్ధంతరంగా నిలిచిపోయిన గృహాల నిర్మాణాలు పూర్తి చేయడానికి అవసరమైన సామగ్రి అందజేస్తామని హోలీక్రాస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ కరణం ప్రభుదాస్ ప్రకటించారు. మండలంలోని సింగిడి ప్రైవేట్ కల్యాణ మండపంలో సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిర్మాణాలు పూర్తి చేసేందుకు అవసరమైన సామగ్రికి తమను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని 12 గిరిజన గ్రామాలకు చెందిన సుమారు 40 మంది లబ్ధిదారులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

మద్దతు ధర కల్పించాలి..



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న గిరిజన సంఘ నాయకులు

సీతంపేట: ఆదివాసీ గిరిజన సంఘం, రైతు సంఘం పిలుపు మేరకు ఈనెల 29న స్థానిక ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.లక్ష్మణరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. జీడి పిక్కలకు మద్దతు ధర, గిరిజన గ్రామాలకు మౌలిక వసతులు కల్పించడం, తదితర డిమాండ్‌లతో ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జె.శ్రీరాములు, ఎం.కాంతారావు, ఎ.గంగాధర్, పి.సాంబయ్య, నీలయ్య, తదితరులు పాల్గొన్నారు.

సందర్శన



వీరఘట్టం: ఎస్సై కళాధర్‌తో మాట్లాడుతున్న డీఎస్పీ రాంబాబు

సీతంపేట: మండలంలోని పలు పదో తరగతి పరీక్ష కేంద్రాలను డీఈఓ ఎన్.తిరుపతినాయుడు శుక్రవారం సందర్శించారు. హడ్డుబంగి, సీతంపేట, దోనుబాయి, మల్లి ఏపీఆర్, ఆశ్రమ పాఠశాలలను సందర్శించి, విద్యార్థులు పరీక్ష రాస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ప్రశాంతంగా..

వీరఘట్టం: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని డీఎస్పీ ఎం. రాంబాబు అన్నారు. వీరఘట్టం బాలికోన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రం వద్ద బందోబస్తుపై ఆరా తీశారు. అనంతరం ఎస్సై కళాధర్‌తో మాట్లాడుతూ.. ఇతరులు పరీక్ష కేంద్రం వైపు రాకుండా చూడాలని ఆదేశించారు. విద్యార్థులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

భామిని: మండలంలోని బత్తిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని ఎంపీడీఓ కొండపల్లి సత్యం పరిశీలించారు. ఎంఈఓ ఎ. శ్రీనివాసరావుతో కలసి కేంద్రాన్ని సందర్శించి, పరీక్ష తీరుపై ఆరా తీశారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని చీఫ్ సూపరింటెండెంట్ కె. వెంకటరావును ఆదేశించారు.

ప్రాథమిక విద్యపై పట్టు సాధించడమే లక్ష్యం

గుమ్మలక్ష్మీపురం:



అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచనలిస్తున్న ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ

అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ పిల్లలకు అందించే ప్రాథమిక విద్యపై అంగన్‌వాడీ కార్యకర్తలు పట్టు సాధించడమే లక్ష్యంగా పోషణ్ బీ పడాయి బీ కార్యక్రమం పేరిట శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ టి.కనకదుర్గ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ బీ పడాయి బీ శిక్షణా తరగతులను ఆమె శుక్రవారం తనిఖీ చేశారు. ప్రీస్కూల్ పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యనందివ్వడంతో పాటు గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సక్రమంగా పౌష్టికాహారం అందివ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.సాల్మన్‌రాజు, భద్రగిరి ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లపై చిన్నచూపు తగదు



ట్రాన్స్‌జెండర్ల సమస్యలు వివరిస్తున్న నీతోడు సొసైటీ డైరెక్టర్ అమితా పోలమెట్ల

గుమ్మలక్ష్మీపురం: ట్రాన్స్‌జెండర్లపై చిన్నచూపు తగదని, ప్రతిఒక్కరూ వారిని గౌరవించాలని నీతోడు సొసైటీ డైరెక్టర్ అమితా పోలమెట్ల అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ టి.శ్రీవరం అధ్యక్షతన సాధికారత వైపు ట్రాన్స్‌జెండర్లు అనే అంశంపై ఆమె కాసేపు మాట్లాడారు. ట్రాన్స్‌జెండర్ల సమస్యలను సహృదయంతో అర్థం చేసుకోవాలని, వారికి రక్షణ, ఉపాధి కల్పనకు సంబంధించి ప్రభుత్వాలు చట్టాలు చేసేలా కృషి చేయాలన్నారు. అన్ని రంగాల్లోనూ వారిని ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య, ఐక్యూ కో–ఆర్డినేటర్ కల్పన తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహం నిర్మాణానికి స్థల సేకరణ



కేదారిపురంలో స్థల సేకరణ చేస్తున్న తహసీల్దారు శేఖర్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కేదారిపురంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల(పీవీటీజీ హాస్టల్) వసతిగృహం నిర్మాణానికి శుక్రవారం స్థల సేకరణ చేశారు. తహసీల్దారు ఎస్.శేఖర్, వీఆర్వో, సర్వేయర్లతో కలిసి వెళ్లి, హాస్టల్ భవనానికి అవసరమైన ఎకరా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సమగ్ర శిక్షా పీడీ జిల్లాకు నాలుగు కొత్త వసతిగృహాలు మంజూరు చేశారని, వాటిలో రెండు వసతిగృహాలు గుమ్మలక్ష్మీపురం మండలంలోని కేదారిపురం, బాలేసు గ్రామాల్లో ఏర్పాటుకు నిర్ణయించడం జరిగిందన్నారు.

విత్తన బంతుల తయారీపై అవగాహన

గుమ్మలక్ష్మీపురం:



మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఏపీ సీఎన్ఎఫ్ గుమ్మలక్ష్మీపురం క్లస్టర్ కో–ఆర్డినేటర్ భూషణ్

మండలంలోని ఎల్విన్‌పేట పంచాయతీ, రేగులపాడు గ్రామంలో విత్తన బంతుల తయారీపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఏపీ సీఎన్ఎఫ్ గుమ్మలక్ష్మీపురం క్లస్టర్ కో–ఆర్డినేటర్ కిమిడి భూషణ్.. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా కంది, మినుము, పెసలు, సామలు, ఊదలు వంటి విత్తన బంతులను తయారు చేసుకోవడాన్ని నేర్పించారు. బంకమట్టి, బీజామృతం, ఘనజీవామృతం తదితర వాటితో కలిపిన విత్తనాలను బంతులుగా తయారు చేసుకుంటే అవి ఆరు నెలల పాటు ఎటువంటి పురుగు, చెద పట్టకుండా ఉంటాయన్నారు. అటువంటి విత్తనాలను నాటితే వర్షం లేకపోయినా మొలకలు వస్తాయని, పంట ఏపుగా పెరిగి దిగుబడి బాగా వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంటీ నిర్మలాదేవి, ఐసీఆర్‌పీ దీప, వీవోఏ రవికుమార్, అగ్రికల్చర్ అసిస్టెంట్ దివ్య పాల్గొన్నారు.

29న ధర్నా



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న సీఐటీయూ, గిరిజన సంఘం నాయకులు

కొమరాడ: గిరిజన సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద ఈ నెల 29వ తేదీన ధర్నా చేపడుతున్నట్లు సీఐటీయూ నాయకుడు కొల్లి సాంబమూర్తి తెలిపారు. ఇదే విషయమై రూపొందించిన వాల్‌పోస్టర్‌ను మండల కేంద్రంలో శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని ఎనిమిది మండలాల్లో గిరిజనులంతా 68 వేల ఎకరాల్లో జీడి సాగు చేస్తున్నారని, వారి పంటలకు దళారుల నుంచి రక్షణ కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే వారి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. గుమ్మలక్ష్మీపురం, సాలూరు మండల కేంద్రాల్లో జీడి ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పాలన్నారు. అలాగే గిరిశిఖర గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.

విచారణ

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని పెద బుడ్డిడి ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుడు వావిలపల్లి వరహాలునాయుడు తీరుపై శుక్రవారం పార్వతీపురం మన్యం జిల్లా ఏపీడీ ఎన్.రమేష్‌రామన్ విచారణ చేపట్టారు. గతేడాది అక్టోబరు నెలలో గ్రామ స్థాయిలో జరిగిన సోషల్ ఆడిట్ కార్యక్రమంలో సదరు క్షేత్ర సహాయకుడిపై అదే గ్రామానికి చెందిన రైతులు రేవల్ల అప్పలనాయుడు, కె.పకీరు నాయుడు, సాసుబిల్లి సత్యంనాయుడు, చందాడ శంకరరావు, బూరాడ సత్యం, పిల్లి సంగమేషు, బెవర శ్రీరాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ విచారణ చేపడుతున్నట్లు ఏపీడీ పేర్కొన్నారు. 2014 అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో సదరు రైతులకు మంజూరైన మినీ గోశాలలకు ఒక్కోదానికి రూ.90 వేలు చొప్పున చెల్లించాల్సి ఉండగా, తొలుత రూ.70 వేలు చెల్లించి, ఆ తర్వాత చెల్లించాల్సిన మిగిలిన రూ.20 వేలకు గాను ఒక్కో రైతు వద్ద నుంచి రూ.5 వేలు చొప్పున క్షేత్ర సహాయకుడి ద్వారా ఉపాధి హామీ పథకం అధికారులకు ఇవ్వగా, మరో రూ.5 వేలు ఇవ్వాలని క్షేత్ర సహాయకుడు డిమాండ్ చేశారని రైతులు తెలిపారు. తనను తొలగించేందుకు తనపై ఇటువంటి ఆరోపణలు చేస్తున్నారని, సదరు రైతులు డబ్బులు తనకు ఇచ్చినట్లు ఎటువంటి ఆధారాలు లేవని క్షేత్ర సహాయకుడు ఏపీడీకి తెలిపారు. అయితే ఇది ముమ్మాటికీ రాజకీయ కక్ష అని గ్రామస్తులు అంటున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో పార్థసారథి, ఏవో కె.రామారావు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఫారంపాండ్‌ల బిల్లులు చెల్లించండి

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని గడసింగుపురంలో చేసిన ఫారంపాండ్‌ల నిర్మాణాలకు సంబంధించిన బిల్లులు చెల్లించాలని వేతనదారులు కోరుతున్నారు. ఇదే విషయమై వారంతా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులను శుక్రవారం కలిసి కోరారు. ఆరు రోజుల పాటు ఫారంపాండ్‌ల పనులు చేస్తే కేవలం రెండు రోజులకు సంబంధించిన బిల్లులే చెల్లించారని పేర్కొన్నారు.

సారాతో ఒకరి అరెస్ట్

సీతంపేట: మండలంలోని వలగజ్జిగూడలో 20 లీటర్ల సారాతో ఒకరిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై అమ్మన్నరావు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు దాడులు చేపట్టి సవర జగ్గారావును అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

నోటిని శుభ్రంగా ఉంచుకోవాలి

జియ్యమ్మవలస రూరల్:



అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు రమ్య

ప్రతిఒక్కరూ నోటిని శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం తప్పనిసరిగా దంతాలను తోముకోవాలని వైద్యురాలు రమ్య సూచించారు. ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవంలో భాగంగా మండలంలోని చినమేరంగి సీహెచ్‌సీ, అక్కడి పాఠశాలల్లోని వారికి నోరు, దంతాల పరిశుభ్రతా చర్యలపై శుక్రవారం అవగాహన కల్పించారు. నోటి దుర్వాసన లేకుండా చూసుకోవాలని, అలాగే దంతాలు పాడవ్వకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు పూర్ణచంద్రిక, చైతన్య, చంద్రవర్మ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్లు, బల్బుల అందజేత



ఫ్యాన్లు, విద్యుత్ బల్బులు అందజేస్తున్న గుమ్మలక్ష్మీపురం ఏటీడబ్ల్యూవో సురేష్‌కుమార్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ బాలికల పాఠశాలతో పాటు గుమ్మలక్ష్మీపురం పోస్ట్‌మెట్రిక్ హాస్టల్(బాలురు), జూనియర్ కళాశాల బాలికల వసతిగృహానికి మంజూరైన ఫ్యాన్లు, విద్యుత్ బల్బులను మండల కేంద్రంలో స్థానిక ఏటీడబ్ల్యూవో బి.సురేష్‌కుమార్ శుక్రవారం అందజేశారు. పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా ఇటీవల ఆయా విద్యాలయాల్లో రాత్రి బస చేసిన అధికారులకు అక్కడి విద్యార్థులు తమ సమస్యలు విన్నవించుకున్నారు. ఈ మేరకు కలెక్టరు ఆదేశాలతో ఐటీడీఏ పీవో ఆయా ఉపకరణాలను మంజూరు చేశారు.

అందుబాటులో ఓఆర్ఎస్ ప్యాకెట్లు



ఈనెల 18న సాక్షిలో వచ్చిన కథనం

వీరఘట్టం: పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులు అలసట చెందితే వారికి ఇవ్వాల్సిన ఓఆర్ఎస్ ప్యాకెట్లను వైద్యారోగ్యశాఖ అరకొరగా ఉంచిన వైనంపై ఈనెల 18న సాక్షిలో ప్రచురితమైన 'ఓఆర్ఎస్ ప్యాకెట్ల కొరత' కథనానికి వైద్యారోగ్య శాఖ సిబ్బంది స్పందించారు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద శుక్రవారం సరిపడా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు.

అశాస్త్రీయంగా జరిగిన వర్గీకరణను అంగీకరించం

- ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ



మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

పాలకొండ: ప్రభుత్వం అశాస్త్రీయంగా చేపట్టిన ఎస్సీ వర్గీకరణను అంగీకరించమని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ స్పష్టం చేసింది. ఈ మేరకు పట్టణంలో ఎస్సీ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు వై. లిల్లీపుష్పనాథం, నూతలపాటి భరత్‌భూషణ్, బత్తిన మోహనరావు మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి వాస్తవ జనాభా ప్రాతిపదికన ఎస్సీ వర్గీకరణ చేయలేదని ఆరోపించారు. దళితుల మధ్య చిచ్చుపెట్టిన కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో గల మాల, రెల్లి కులాలకు తీవ్ర అన్యాయం చేస్తోందని ఆరోపించారు. రాజ్యాంగంలో ఆర్టికల్ 341ను సవరించకుండా, పార్లమెంట్‌లో చర్చ లేకుండా వర్గీకరణ చేపట్టడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. మాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు స్పందించి వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేయకపోతే మాలజాతి ఆందోళన చేపడుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జేఏసీ సంఘ సభ్యులు తిర్లంగి ఉపేంద్రకుమార్, రాకోటి వెంకటరావు, జామి అనిల్, ఎలగడ రాజకుమార్, రావాడ రవి, బత్తిన రమణ, రాజాన చంటి, తదితరులు పాల్గొన్నారు.